# మనిషి-మనసు

**ఇంటికొచ్చేసరికి మళ్ళీ తాళం. మనసు చివుక్కుమంది. పక్క 'కిటికీ'లో తాళం చెవి, చిన్న కాగితం. అనాసక్తిగానే మడత విప్పాడు మోహన్.**

**"ఇంటావిడ జ్యోత్స్నగారితో షాపింగ్‌కి వెడుతున్నాను.ఫ్లాస్కులో కాఫీ ఉంది. తాగేయండి" భార్యామణి లలితగారి మెసేజ్.**

తన కోపాన్ని ఎవరి మీద చూపాలో తెలీక ఆ కాగితాన్ని చేయగల్గినంత చిన్న ముక్కలు చేసి కసిగా విసిరేసాడు మోహన్. లోపలికి వచ్చి కాఫీ తాగి ఉదయం సగం చదివిన పేపరు తిరగేస్తూ కూచున్నాడు.

తొమ్మిది గంటలు అవుతుంటే లలిత వచ్చింది. చేతిలో పేకెట్స్, మొహంలో ఉత్సాహం. ''అయ్యో చాలా లేటయిందండీ. ఎంత! పది నిముషాల్లో వంట చేసేస్తాను. అదిగో నాకు రెండు చీరలు కొన్నాను. ఎలా ఉన్నాయో చూసి చెప్పండి. మళ్ళీ మొహం మాడ్చుకోకండి'' అని నవ్వుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మోహన్, లలితది మధ్యతరగతి కుటుంబం. బాగానే సాగిపోతోంది. ఉన్నంతలో హ్యాపీగానే గడిచిపోతోంది.ఈమధ్య ఇరవై రోజుల క్రితం ఆఫీసుకి దగ్గర్లో ఇల్లు మారారు. అది ఒక పెద్ద బిజినెస్ మాగ్నెట్ గారి ఔట్ హౌస్. ఇల్లు బ్రహ్మాండంగానే ఉంది. అద్దెకొంచెం ఎక్కువే. అయినా తీసుకున్నాడు. అది భరించగల్గినా వేరే సమస్య తనని పట్టి పీడిస్తోంది.

ఓనర్ జ్యోత్స్నగారి పిల్లలు ఫారిన్‌లో చదువుతున్నారు. ఆవిడకా చేతినిండా డబ్బు, ఖాళీ సమయం. మరీ వయసయిపోయిన ఆవిడా కాదు. ఇంటినిండా నౌకర్లు. అందుకు తనకు బాధ లేదు. కానీ ఆవిడ రోజూ సినిమాలు, షాపింగ్‌లు అంటూ బయట కెళుతుంది. తోడుకోసం తన భార్యామణి లలితని తీసుకెళ్ళడమే తన ప్రాణానికి వచ్చింది. ఇంటిలోకి వచ్చిన రెండవరోజు ఏదో గుడిలో హోమాలు, జపాలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయని తనకి ప్రత్యేక ఆహ్వానం అందిందని లలితని తీసుకువెళ్ళింది. ఇంటికి వచ్చాక గుడిలో అన్నీ చాలా బాగా జరిగాయని, జ్యోత్స్నగారు తన పేరు, గోత్రం చెప్పించారని మురిసిపోతూ చెప్పింది. అంతేకాక ఆవిడ గుడికి చందాగా ఐదు వేల రూపాయలు ఇస్తుంటే తనకి మొహమాటం వేసిందని, అందుకే తాను ఐదొందలు చదివించానని చెప్పింది. దేవుడికోసం కదా అతని తనూ పెద్దగా పట్టించుకోలేదు.

రాను రాను ఈ తలనొప్పి మరింత ఎక్కువైంది. ఒకరోజు ఫ్లవర్‌వేజ్‌లో పూలు అంటుంది. ఒకరోజు పూలకుండీలు అంటుంది. టీ పాయ్ మీద లేసు అల్లినది అందమైనది, ఖరీదయినది, కావాలంటుంది. తన ఎటిఎం కార్డును తీసుకెళ్ళడం, డ్రా చేయడం, ఖర్చుపెట్టడం తప్ప లలితకి వేరే పని లేదు. పైగా అంత డబ్బు ఉన్న ఆవిడ తనతో కలుపుగోలుగా స్నేహం చేయడం తనకి గొప్పతనం పెరిగినట్లు భావించడం, తన కారులో తీసుకెళ్ళడం మరింత హోదా అన్నట్టు మాట్లాడటం, తనకి చాలా చిరాగ్గా ఉంది. ఇప్పుడు తను ఓ కొత్త లలితని చూస్తున్నాడు. ఇల్లు, వంట, అభిమానం, ప్రేమ, ఏమీ పట్టట్లేదు. ఎంతసేపు జ్యోత్స్నగారి కబుర్లే. వాళ్ళ ఫారిన్ ఫర్నిచర్ గూర్చో, సింగపూర్ టీసెట్టు గురించో, ఫారిన్ కారు గురించో ఇవే కబుర్లు. మధ్య మధ్యలో తన పరిస్థితిని గూర్చి చెప్పుళ్ళు. ఆవిడతో షాపింగ్‌కి వెళ్ళాను. సినిమాకు వెళ్ళాను. అనటం ఏదో ఒకటి కొనుక్కురావడం. అది ఎంతవరకు అవసరం అన్న ధ్యాస లేకపోవడం. చాలా విసుగ్గా ఉంది.

ఇదివరకు ఇంటికి రావడానికి తొందరపడేవాడు. అప్పుడు ఆలస్యం అయ్యేది. ఎంతో ఆత్రుతతో భార్య ఎదురుచూస్తూ ఉండేది. ఇప్పుడు త్వరగా ఇంటికి వస్తే ఇంటికి తాళం, ఆర్థికంగా, మానసికంగా రెండు విధాలా పరిస్థితి చేజారింది. ఒక ఆదివారం లలితని ఎలాగో సావకాశంగా కూర్చోపెట్టి, ''లలితా అర్థం చేసుకో. ఇంతకు ముందు మనం సంతోషంగా లేమా? అప్పుడప్పుడు సినిమాలు, షికార్లు అంటూ వెళ్ళలేదా? మనం వచ్చి ఇరవై రోజులయింది. ఇన్ని రోజుల్లో మనం తీరిగ్గా మాట్లాడుకున్నదే లేదు. రోజూ షాపింగ్, సినిమాలు, సిడిలు వాటిలోనే ఎంజాయ్‌మెంట్ ఉంటుందనుకుంటే అర్థం లేదు. అది కూడా రొటీన్ అయిపోతే బోర్ కొడుతుంది. కాసేపు చల్లగాలిలో కూర్చొని వేడి కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటుంటే మనసుకెంత ఆహ్లాదంగా ఉంటుంది'' అంటూ తను కొనసాగించే లోపే ''మీరే చెప్పారుగా ఇదీ బోర్ కొడుతుందని, 'బోర్' కొట్టినప్పుడు చూద్దాంలెండి'' అని తేల్గ్గా కొట్టిపారేసింది. ఇదే తీరున సాగితే? గుండె గుభేల్‌మంది.

మర్నాడు మోహన్ ఇంటికి రాకుండా పార్క్‌కి పోయి కూచున్నాడు. ఏమైనా ఈరోజు ఈ సమస్యకి పరిష్కారం వెదకాలి. గడ్డిపరకల్ని చేతితో తుంపుతూ తీవ్రంగా ఆలోచించాడు. వెంటనే ఓ ఐడియా వచ్చింది. హుషారుగా ఇంటికి వెళ్ళాడు. యథావిధిగా తాళం తీసుకుని పేపరు చదువుతూ టీవీ చూస్తూ గడిపేశాడు.

మోహన్ ఇంటివేట మొదలెట్టాడు. ఒక స్లమ్ ఏరియాకు కొంచెం దగ్గరగా ఒక మంచి ఇల్లు. అన్ని విధాలా సౌకర్యంగా ఉండేలా చూసి ఎడ్వాన్సు ఇచ్చేశాడు. ఆ తర్వాత లలితకి చెప్పాడు. ఇద్దరికీ పెద్ద యుద్ధమే జరిగింది. ''మీరు ఇల్లు ఎందుకు మారుతున్నారో నాకు తెలుసు. నా ప్రవర్తన నేను మార్చుకోను. జ్యోత్స్నగార్ని, నన్నూ విడదీయాలని మీ ప్రయత్నం'' అంటూ ఏదేదో మాట్లాడింది. అయినా తను వినలేదు.

నెల్లాళ్ళు పూర్తికాగానే, ఇంటి వాళ్ళకి సర్దిచెప్పి ఇల్లు మారిపోయాడు. లలితకి చాలా అసంతృప్తిగానే ఉంది. ఇల్లు మారి 4 రోజులు గడిచిపోయాయి. ఇంటికి రాగానే లలితలో ఏదో మార్పు కనిపించింది. వేడి వేడి పకోడీలు ప్లేటులో సర్దింది. ఫ్లాస్కులో టీ తీసుకొచ్చింది. ''ఏమిటి సంగతి?'' అన్నాడు తను నవ్వుతూ.

''ఆ దూరంగా కన్పిస్తున్న ఇళ్ళవాళ్ళని చూస్తే జాలేస్తోందండి. అందుకే మీకు పనికిరాని పాట్టయిన ప్యాంట్లు, షర్టులు వాళ్ళకిచ్చేసాను. వాళ్ళెంత సంతోషించారో, ఏ పని కావాలన్నా చేసి పెడతామన్నారు. వాళ్ళ కళ్ళలో ఎంత కృతజ్ఞతో. అంతేకాదు. ఓ నలుగురు అనాథ పిల్లలకి రేపట్నించీ చదువు చెప్పాలనుకుంటున్నాను. నా డిగ్రీ ఇలా ఉపయోగపడితే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఆ నలుగుర్ని నా దత్తపుత్రులుగా భావిస్తాను. వాళ్ళు ఉన్నతిలోకి రావాలి. మనమెంత అదృష్టవంతులమో నాకర్థం అయింది. ఇప్పుడు నాకెంతో సంతృప్తిగా ఉంది'' అంది లలిత. 'ఈ విషయం నీకు ప్రాక్టికల్‌గా తెలియచేయడానికే ఈ ఇల్లు మారింది' అనుకుంటూ తను ఆనందంగా నిట్టూర్చాడు.

**-ఎల్.శ్రీదేవి** (నరసాపూర్)

